www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
శుక్రవారం 30 మే 2025

విలేఖరులు కావలెను



కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రిబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003



# జూరాల 10 గేట్లు ఎత్తివేత

**పూర్తిస్థాయి నీటిమట్టం : 318.516 మీటర్లు**

**ప్రస్తుత నీటిమట్టం : 317.360 మీటర్లు..**

## మే నెలలో గేట్లు ఎత్తివేయడం ప్రాజెక్టు చరిత్రలోనే ఇది మొదటిసారి

కలంజ్యోతి, జోగులాంబ గద్వాల : కర్నాటక, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణానదికి వరద పోటెత్తుతోంది. భారీ వర్షాలు, వరదతో కృష్ణానదిపై గల ప్రాజెక్టుల్లోకి వరద నీటి ప్రవాహం భారీగా వచ్చి చేరుతోంది. మహబూబ్ నగర్ లో ఉన్న జూరాల ప్రాజెక్టుకు వరద నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో.. గురువారం సాయంత్రం ప్రాజెక్టు 10 గేట్లు ఎత్తివేశారు అధికారులు. ప్రస్తుతం ప్రాజెక్టుకు 66 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉండగా.. 10 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ఈ నీరంతా దిగువన గల శ్రీశైలం ప్రాజెక్టులోకి చేరనుంది. కాగా, మే నెలలో జూరాల గేట్లు ఎత్తివేయడం ప్రాజెక్టు చరిత్రలోనే ఇది మొదటిసారి అని అధికారులు పేర్కొన్నారు. అయితే అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఎగువన మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. కృష్ణా, దాని ఉపనదుల్లో ఎన్నడూ లేనంత వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం 66 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా.. శుక్రవారం ఉదయం వరకు లక్ష క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలోనే ముందస్తుగా జలాశయం నుంచి నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. జూరాల ఇన్ ఫ్లో 40,000 క్యూసెక్కులుగా ఉండగా, ఔట్ ఫ్లో 82,000 క్యూసెక్కులుగా కొనసాగుతుంది. జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.389 టీఎంసీలు నిల్వ చేస్తూ వరద ప్రవాహాన్ని నియంత్రిస్తున్నారు. జూరాల పూర్తిస్థాయి నీటి మట్టం: 318.516 మీటర్లు కాగా.. ప్రస్తుత నీటి మట్టం: 317.360 మీటర్లు ఉంది. జూరాల ప్రాజెక్టుపై ఆదారపడి ఉన్న నెట్టెంపాడు ఎత్తిపోతలకు 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



## వేములవాడ ఆలయంపై తప్పుడు ప్రచారం

### ఆలయ ఈవో వినోద్

**కలంజ్యోతి, వేములవాడ :** దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయాన్ని జూన్ 15 నుంచి మూసివేస్తున్నరంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమని, వాటిని భక్తులేవరు నమ్మవద్దని ఆలయ ఈవో వినోద్ స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో రాజన్న ఆలయం మూసివేస్తున్నారంటూ విస్తృతంగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో గురువారం ఈవో ఈ విషయంపై స్పందిస్తూ క్లారిటీ ఇచ్చారు. వేములవాడ రాజన్న ఆలయం మూసివేత అంశంలో కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు జరుగుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. భక్తులేవరూ ఈ వార్తలను నమ్మవద్దని కోరారు. భక్తులను తప్పుదోవ పట్టించే ఇలాంటి వార్తలను సామాజిక మాధ్యమాల్లోనూ ఎవరు షేర్ చేయవద్దని కోరారు. వేములవాడ రాజన్న ఆలయానికి సంబంధించిన ఎలాంటి సమాచారమైనా రాష్ట్ర దేవాదాయ శాఖ నుండి గానీ లేదంటే ఆలయ అధికారుల నుండి గానీ వస్తుందన్నారు. ఇప్పటికే తప్పుడు వార్తలను ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రాజన్న ఆలయానికి సంబంధించిన ఎలాంటి సమాచారం కావాలన్నా దేవస్థానం అధికారిక వెబ్ సైట్ ను సందర్శించాలని లేదంటే తమను నేరుగా సంప్రదించాలని భక్తులకు సూచించారు.



## కలెక్టర్ ని కలిసిన నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ

**కలంజ్యోతి, మంచిర్యాల :** తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గీట్ల సుమిత్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం లో కలెక్టర్ దీపక్ కుమార్ ని కలిశారు. వివిధ కారణాలతో నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం కార్యవర్గము సభ్యులు కొన్ని స్థానాల వారు రాజీనామ చేయాగ ఇటీవల ఆయా స్థానాలను రాష్ట్ర కమిటీ వారు మంచిర్యాల జిల్లా కార్యదర్శిగా కవిత రాణి, ని కోశాధికారి గా సుజాత ను ఎన్నుకొని ఉత్తర్వులు జారీ చేయగా మంచిర్యాల జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పూర్తి స్థాయి కమిటీ సభ్యులతో మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. కార్యక్రమములో మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యులు మరియు జిల్లాలో వివిధ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఆఫీసు సబర్డినేట్స్ పాల్గొన్నారు.

# నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

### మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



**కలంజ్యోతి, మంచిర్యాల :** ప్రజలకు నిరంతరం త్రాగునీటిని అందించేందుకు అమృత్ 2.0 పథకం క్రింద చేపట్టిన ట్యాంక్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో నిర్మిస్తున్న అమృత్ 2.0 నీటి ట్యాంక్ నిర్మాణ పనులను మున్సిపల్ కమీషనర్ మురళీకృష్ణతో కలిసి సందర్శించి పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకం, అమృత్ 2.0 పథకాల ద్వారా ప్రతి ఇంటికి నిరంతరం త్రాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఈ క్రమంలో పట్టణంలో చేపట్టిన అమృత్ 2.0 నీటి ట్యాంక్ నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మండలంలోని ఆస్మాద్, గంగారం గ్రామాలలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల తహశిల్దార్ మల్లిఖార్జున్ తో కలిసి సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న అకాల వర్షాల పరిస్థితులలో కొనుగోలు కేంద్రాలలోని ధాన్యాన్ని వెంటనే కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని, సన్న రకం వడ్లు విక్రయించిన రైతులకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల అదనపు బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల కోసం త్రాగునీరు, నీడ, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైన గోనెసంచులు, టార్పాలిన్లను సమకూర్చడం జరిగిందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసిన కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## యువతి వివాహానికి బీటీఆర్ ఫౌండేషన్ చేయూత

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** మండలంలోని రహీం ఖాన్ పేట (ఎర్నర్సుపల్లి) గ్రామానికి చెందిన పెద్ది బీరయ్య మల్లవ్వ కుమార్తె అపర్ణ నరేష్ వివాహనికి టేక్ మంచాలు, రూ.10 వేల విలువైన వస్తు సామగ్రిని బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెంద్రం తిరుపతిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఇల్లంతకుంట మండలంలోని పేద కుటుంబలా కుమార్తెల వివాహాలకు ఎల్లపుడు సహాయాలు అందిస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఫౌండేషన్ సేవా ప్రతినిధులు చుక్క రమేశ్, జెట్టి హరికృష్ణ, చుక్క ఎల్లయ్య, జెట్టి హరికృష్ణ, పెద్ది పరుశురాములు, కముటం పరుశురాం, నాగుల సాయి, జెట్టి ప్రశాంత్, జెట్టి విష్ణు, రావుల భూమయ్య, పెద్ది ఓదెలు, పల్లె రాజు, రాగుల నరేష్, చుక్క అనిల్, చుక్క ఏనుగుల, పెద్ది మారుతి, పెద్ది అజయ్, పెద్ది రాజయ్య, జెట్టి మల్లయ్య, పెద్ది అభిరామ్, తదితరులు వధువును ఆశీర్వదించారు.



కలంజ్యోతి 3
శుక్రవారం 30.05.2025 General News





# ఐదు తరాల ఆత్మీయ సమ్మేళనం

- దూడమ్మకు వందేళ్ల సంబురం
- అపూర్వ సమ్మిళితమైన బుచ్చమ్మ కుటుంబం
- దాదాపు 300 మంది హాజరు
- కొత్తూరులో అంగరంగ వైభవంగా ఆత్మీయ సమ్మేళనం
- మధురానుభూతులను పంచుకున్న కుటుంబ సభ్యులు

**కలంజ్యోతి, నర్సంపేట :**

గజిబిజి, ఉరుకులు పరుగుల జీవితంలో ఒకరిని ఒకరు కలుసుకునే పరిస్థితి లేదు. అటువంటి తరుణంలో బుచ్చమ్మ కుటుంబీకులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకునేందుకు నిర్ణయించారు. వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని కొత్తూరులో గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బుచ్చమ్మ కు దూడమ్మ, సుక్కమ్మ, లింగమ్మ, జక్కమ్మ, సారమ్మ, లచ్చమ్మ, సమ్మయ్య మొత్తం ఏడుగురు సంతానం. వారికి సంబంధించిన వారసులు సుమారు 400 మంది కొత్తూరులో ఆత్మీయ సమ్మేళనానికి తరలివచ్చారు. బుచ్చమ్మ నుంచి ఇప్పటి తరానికి చూస్తే దాదాపు ఐదు తరాలు ఉన్నాయి. వాటిలో మొదటి తరానికి ప్రస్తుత తరానికి మధ్య దాదాపు 400 మంది కుటుంబీకులు ఉన్నారు.

ఐదు తరాల వారసులు ఒక్కటైన వేళ.. పది దశాబ్దాల క్రితం పడిన బీజానికి నిలువెత్తు నిదర్శనం.! ఆ మొక్క క్రమక్రమంగా వటవృక్షంగా రూపాంతరం చెందింది. దశాబ్దాల నాటి బీజం నేడు నాలుగు వందల మందికి జీవదానమై నిలిచింది. నిలువెత్తు సాక్షంగా కుటుంబాలు పురుడు పోసుకున్నాయి. అలా అలా.. ఐదు తరాల వారసత్వాలు ప్రజ్వరిల్లుతున్నాయి.!? ఆ పచ్చని సంసారాలకు ఆధ్యురాలు బుచ్చమ్మ. వారి వారసత్వం ఆదివారం అపూర్వమైన.. ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ చారిత్రక ఘట్టానికి వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని బుచ్చమ్మ స్వగ్రామమైన కొత్తూరు వేదికైంది. ఇదే వేడుకలో బుచ్చమ్మ పెద్ద కూతురు బుచ్చమ్మ కు వందేళ్లు నిండడంతో అత్యంత వైభవంగా సన్మానించుకున్నారు.





## అంగరంగ వైభవంగా ఆత్మీయ సమ్మేళనం..


ఆత్మీయ సమ్మేళనం అంగరంగ వైభవంగా సాగింది. 400 మంది ఒక్క చోటుకు చేరడంతో పండగ వాతావరణాన్ని సంతరించుకున్నది. ప్రతీ ఒక్కరినీ వేదిక పైకి పిలిచి పరిచయం చేసుకున్నారు. ఎవరికి ఏమవుతారోనని వరుసలు కలుపుకుంటూ.. ఆత్మీయత, అనుబంధాన్ని చాటుకున్నారు. ఎవరికి కష్టం వచ్చినా.. అందరం ఒక్కటి కావాలని ప్రతినబూనారు. పసందైన వంటకాలతో సహపంక్తి భోజనాలతో అనురాగాన్ని పంచుకున్నారు. అనంతరం మహిళలు, పురుషులు ఉత్సాహంగా డాన్స్ లు వేస్తూ.. కేరింతలు కొట్టారు. అనంతరం దాదాపు 90 భార్యాభర్తలను వేదిక పైకి పిలిచి శాలువ, పుష్పగుచ్ఛంతో సత్కరించి మధుర స్మృతులను భద్రపర్చుకున్నారు.





## దూడమ్మకు వందేళ్ల సంబురం..

బుచ్చమ్మ తొలుసూరు కూతురు దూడమ్మ. ఆమెకు ప్రస్తుతం వందేళ్లు పూర్తి చేసుకున్నది. ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా ఆమెను కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించుకున్నారు. ఆమెతో ఉన్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. ప్రస్తుత కాలంలో వందేళ్లు జీవించడం అంటే ఆశామాషీ విషయం కాదు. అటువంటిది దూడమ్మ వందేళ్లు పూర్తి చేసుకోవడంతో కుటుంబీకులు హర్షం వ్యక్తం చేశారు.





### రాష్ట్రావతరణ వేడుకలు
# ఘనంగా జరపాలి
### కలెక్టర్ అభిలాష అభినవ్

**కలంజ్యోతి, నిర్మల్ :** రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. వేడుకలకు ప్రజా ప్రతినిధులు, ప్రముఖులను ఆహ్వానించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. వేదికను పూలతో అలంకరించి, ప్రోటోకాల్ నిబంధనల మేరకు సీటింగ్ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. విద్యార్థులతో తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయాలు, దేశభక్తి ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వేడుకలకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా టెంట్లు, షామియానాలు, తాగునీరు, అల్పాహారం, పండ్ల సరఫరా నిరంతరం అందుబాటులో ఉంచాలన్నారు. పరిసరాలలో శుభ్రత పాటించాలని, పోలీస్, అగ్నిమాపక శాఖల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యశాఖ అత్యవసర మందులతో సహా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. రాజీవ్ యువ వికాసం సహా వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రత్న కళ్యాణి పాల్గొన్నారు.

# కేసీఆర్ హయాంలో ఒక్క ఇల్లు కూడా ఇయ్యలే..

### ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ
### ఎమ్మెల్యే సత్యం

**కలంజ్యోతి, మల్యాల :** కేసీఆర్ హయంలో నిరుపేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విమర్శించారు. మల్యాల మండలంలోని సర్వాపూర్ మినహా మిగతా అన్ని గ్రామాలకు చెందిన 303 మంది లబ్ధిదారులకు గురువారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో కలిసి ఎమ్మెల్యే మంజూరు పత్రాలను (ప్రొసీడింగ్స్) అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అన్ని రంగాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు . కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు . ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ బి ఎస్ లత , ఆర్డీవో మధుసూదన్ గౌడ్ , ఎంపీడీవో స్వాతి , తహసీల్దార్ వసంత , ఎంపీఓ



ప్రవీణ్ , మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ మల్లేశ్వర్ గౌడ్ , సింగల్ విండో చైర్మన్లు ముత్యాల రామలింగారెడ్డి , తోట్ల చంద్రశేఖర్ , డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొంగ అనంద రెడ్డి , వెల్మ లక్ష్మారెడ్డి , దారం అదిరెడ్డి , జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ గౌడ్ , యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శనిగారపు తిరుపతి , మ్యాక లక్ష్మణ్, సంత ప్రకాష్ రెడ్డి , కనకట్ల జలంధర్ , దిండు ప్రవీణ్ , నరసింహారెడ్డి , ప్రతాప్ , వీరభక్తిని ప్రసాద్ , కంచర్ల లక్ష్మణ చారి , నక్క అనిల్, మిల్త్రీ శీను, బండి రవి, బీవీ రమణ, ముద్దం శ్రీనివాస్, మరి లక్ష్మణ్, సురేష్, కటుకూరి తిరుపతి స్వామిరెడ్డి, ఎండి ఇమామ్, నాగులపేట సంజీవ్, కొండబత్తిని అనిల్, బాలే శ్రీనివాస్, వెంకటేష్, తాళ్ల హరినాథ్, దూడం రామాంజ నేయులు తదితరులు పాల్గొన్నారు.

### లే - అవుట్లను నిబంధనలకు
# లోబడి అనుమతించాలి

**కలంజ్యోతి, మంచిర్యాల :** జిల్లాలో భూముల లేఅవుట్ల కొరకు అందిన దరఖాస్తుల సంబంధిత భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనలకు లోబడి అనుమతించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో లేఅవుట్ కొరకు అందిన దరఖాస్తు సంబంధిత భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల అభివృద్ధి, ఇండ్ల నిర్మాణం, వెంచర్ల ఏర్పాటులో భాగంగా లేఅవుట్ కొరకు అందిన దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి నియమ, నిబంధనల ప్రకారం అనుమతులు మంజూరు చేయాలని తెలిపారు. లేఅవుట్ దరఖాస్తు సంబంధిత లనిర్ధారించుకోవాలని, లేఅవుట్ సమీపంలో చెరువులు, వాగులు ఇతర ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. ఈ క్రమంలో ప్రభుత్వ భూములు రక్షణ దిశగా చర్యలు తీసుకోవాలని, ఆక్రమిత ప్రభుత్వ భూములను చట్టం ప్రకారం చర్యలు తీసుకొని స్వాధీనపర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### 24,705 మంది రైతుల ఖాతాలలో
# రూ.262 కోట్లు జమ
### జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్



**కలంజ్యోతి, మంచిర్యాల :** జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 320 కేంద్రాలు ద్వారా 24 వేల 705 మంది రైతుల వద్ద నుండి 1 లక్ష 73 వేల 814 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 262 కోట్ల 10 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసిన 205 కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు 1 వేయి 500 మంది సిబ్బంది, హమాలీలు యజ్ఞంలా పని చేస్తున్నారని, నిత్యం 4 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 358 లారీల ద్వారా 2 వేల 500 నుండి 5 వేల టన్నుల ధాన్యం పెద్దపల్లిలోని 110 మిల్లులకు, జిల్లాలోని 20 మిల్లులకు తరలించడం జరుగుతుందని, మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగంగా జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు దాదాపు 5 కోట్ల రూపాయల నుండి 8 కోట్ల రూపాయలు సంబంధిత రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు.

### ధాన్యం బస్తాతో
# కలెక్టరేట్ కు రైతు

**కలంజ్యోతి, నిర్మల్ :** ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేస్తోందంటూ రైతు కలెక్టరేట్ కు ధాన్యం బస్తాతో వచ్చి నిరసన వ్యక్తం చేశారు. నిర్మల్ జిల్లా లక్ష్మణ చాంద మండలం బాబాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆ గ్రామానికి చెందిన రైతు ధాన్యం కొనుగోలు చేయాలని ధాన్యం బస్తాతో కలెక్టరేట్ కు వచ్చి నిరసన వ్యక్తం చేశారు. నిర్మల్ జిల్లా ధాన్యం 15 రోజులైనా ధాన్యం కొనుగోలు చేయడం లేదని, వెంటనే కొనుగోలు చేయాలని నిరసన వ్యక్తం చేశారు. అలాగే బస్తాకు 41 కిలోలు తూకం వేస్తున్నారని ఆరోపించారు. అకాల వర్షంతో ధాన్యం తడిసిపోయి మొలకలు వస్తున్నాయని వెంటనే కలెక్టర్ స్పందించి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని ఆ రైతు కోరారు.



కలంజ్యోతి
శుక్రవారం 30.05.2025 General News


## రైతులకు నాణ్యమైన విత్తనాలు

# అందుబాటులో ఉంచాలి

### స్పెషల్ ఆఫీసర్ అశోక్



**కలంజ్యోతి, నాగారం** : నాగారం మండలంలో రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉండాలని. నాగారం మండలం ప్రత్యేక అధికారి అశోక్ అని అన్నారు. గురువారం మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేసి విత్తనాలను పరిశీలించి. అనంతరం మాట్లాడుతూ మండలంలోని రైతులందరికీ నాణ్యమైన విత్తనాలను అమ్మాలని, సమయానికి అనుగుణంగా విత్తన కొరత రాకుండా విత్తనాలను అందుబాటులో ఉంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ విత్తనాలను వాటి ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ రేటుకు అమ్మకూడదని తెలియజేశారు.లైసెన్స్ కలిగిన డీలర్ వద్ద నుంచి, బిల్ తీసుకొని మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని తెలియజేశారు. పక్క రాష్ట్రాల నుంచి విత్తనాలు తీసుకొవద్దు అని, నకిలీ విత్తనాలు, లూజు విత్తనాలు అమ్మే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతులను సూచించారూ. అనంతరం స్కూల్ యూనిఫారం స్టిచ్చింగ్ కేంద్రాన్ని సందర్శించి పాఠశాలలు ప్రారంభం కావడం కంటే ముందే యూనిఫాంలో తయారు చేయాలని వారి నీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ హరి కిషోర్ శర్మ ఎంపీడీవో మారయ్య వ్యవసాయ అధికారి కృష్ణ కాంత్, మండల విద్యాధికారి ప్రభాకర్ దుకాణదారులు పాల్గొన్నారు.

# అహల్యబాయి జయంతి వేడుకలు

### బీజేపీ మండలాధ్యక్షులు గాజుల మల్లేశం



**కలంజ్యోతి, మల్యాల** : మండల కేంద్రంలో అధ్యక్షుడు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో అహల్యబాయి జయంతి వేడుకలలో భాగంగా గురువారం మల్యాలలో చేనేత వస్త్రాలు తయారు చేస్తున్న రమేష్. శంకరయ్య.పన్నాటి శంకరయ్య. మహేష్ కార్మికులను సన్మానం చేశారు. నాయకులతో కలిసి వస్త్రాలు తయారుచేసే విధానాన్ని పరిశీలించారు.రెండు వందల డెబ్భై సంవత్సరాల క్రితమే రాణి అహల్యబాయి తన ఏలుబడిలో ఉన్న రాజ్యంలోని మహేశ్వరం వద్ద వస్త్ర పరిశ్రమలను నెలకొల్పి చేనేత వృత్తిని ప్రోత్సహించినదని ఆకాలంలోనే బంగారు, వెండితో జరి, పట్టు చీరలు తయారుచేశారని, ఆచీరలు మహేశ్వరం చీరలుగా ఎంతో ప్రాచుర్యం పొంది విదేశాలకు సైతం ఎగుమతి చేశారని అన్నారు.రాణి అహల్యబాయి నిత్యం ప్రజాక్షేత్రంలో పర్యటించి రోజుకొక్క చేతివృత్తుల వారితో, కులవృత్తుల వారితో విడివిడిగా సమావేశమయి వారి సమస్యలకు పరిష్కారం చూపేవారని అంతేకాకుండ వారితో కుల, మత, వర్ణ, లింగ భేదం లేకుండా సహపంక్తి భోజనాలు కూడా చేసేవారని అందుకే ఆమెను రాజమాత అని పిలిచేవారని అన్నారు. ఎలాంటి నేలల్లో ఎలాంటి పంటలు వేయాలి రైతులకు ఎంతమేరకు రాయితీ ఇవ్వాలో అని నిర్ణయించి వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించిందని తెలిపారు. అహల్య బాయి పాలనను స్ఫూర్తిగా తీసుకొని నేడు నరేంద్రమోదీ పరిపాలన కొనసాగిస్తున్నారని అందుకే చేతి వృత్తులను, కులవృత్తులను ప్రోత్సహించడానికి విశ్వకర్మ యోజన పథకం,ఆత్మ నిర్భర్ భారత్,మేక్ ఇండియా, మేడ్ ఇండియా, స్కిల్ ఇండియా ద్వారా పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహిస్తూ ప్రపంచ ఆర్థికవ్యవస్థలో 11వ స్థానంలో ఉన్న భారతదేశాన్ని 4వ స్థానానికి తీసుకువచ్చి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని దేశంలో ప్రాథమిక రంగం అయిన వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహిస్తూ ఎరువులపై వేలకోట్లు రాయితీలు ఇచ్చి పెట్టుబడి సాయంగా ఏడాదికి ఎకరాకు కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా అరువేల రూపాయలు ఇచ్చి రైతును రాజును చేయాలనే దృఢ సంకల్పంతో అహల్యబాయి, అంబెద్కర్ గార్ల ఆలోచనలకు అనుగుణంగా అంత్యోదయ అనే మూల సిద్ధాంతంతో నరేంద్రమోదీ పరిపాలన కొనసాగిస్తున్నారని అందుకే పదకొండేళ్ల పాలనలో 18వేల ఆదివాసీ గ్రామాలకు, తండాలకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించారు. అనంతరం చేనేత కార్మికులకు సన్మానం చేశారు. ఈకార్యక్రమంలో ఓబీసీ మద్దతుతో ఉపాధ్యక్షులు బొబ్బిలి వెంకటస్వామి యాదవ్,కరబుజా చక్రం గౌడ్,కటకంలత,అవుదుర్తి రమా,సునంద,రాజ్ కుమార్, బండారి రాజు,సొనాకుల శ్రీనివాస్, గోవర్ధన్ రెడ్డి,మిరుదొడ్డి హరీష్, గడ్డం చిన్న మల్లేశం, కటకం హర్షవర్ధన్,సంగ శంకర్, బైరి విజయ్,పంబాల గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



## 3.25 క్వింటాళ్ల మొక్కజొన్నల దోపిడీ

### ఇద్దరి అరెస్ట్

**కలంజ్యోతి, నిర్మల్** : 325 క్వింటాళ్ల మక్కల మొక్కజొన్నలను లారీనుంచి చోరీ చేసిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపించారు. కుంటాల మండలం కల్లూరు గ్రామానికి చెందిన బొద్దుల శ్రీనివాస్ కు చెందిన 325 క్వింటాళ్ల మక్కలను ఏప్రిల్ 23వ తేదీన ఒక వ్యక్తి లారీలో లోడ్ చేసి తీసుకెళ్తానంటూ, మోసగించి, మక్కలను చోరీచేశాడు. చోరీ జరిగిన విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన బాధితుడు నర్సాపూర్ (జి) పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అనంతరం పోలీసు విచారణలో రాజీవ్ నగర్ తాండకు చెందిన బాదావత్ సంతోష్, నిజామాబాద్ చెందిన అబ్దుల్ రజాక్ లు లోడును కామారెడ్డి సమీపంలోని స్నేహ చికెన్ ఫార్మ్ గోదాంకు పివి ఏజెన్సీ ద్వారా విక్రయించిరూ.7.48 లక్షలు సొమ్ము చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. బైంసా నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు గుర్తించి గురువారం అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. నేరస్థుల నుంచి రెండు లారీలు మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొన్నారు. ఈ ఘటనలో ఇతరుల పాత్ర ఉన్నట్లు గుర్తించామని, వారిని కూడా విచారించి అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు.కేసును పరిశోధించిన నిర్మల్ రూరల్ సీఐ మున్నూరు కృష్ణ, ఎస్సై సాయి కిరణ్ ను జిల్లా ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల అభినందించారు.



## ఇరుముడుల ద్వారా అంజన్నకు ఆదాయం

### ఈవో శ్రీకాంత్ రావు

**కలంజ్యోతి, మల్యాల** : తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లా మల్యాల మండలం అచ్చంపేట గ్రామంలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి వారి పెద్ద జయంతి సందర్భంగా దీక్ష స్వాముల ద్వారా వచ్చిన ముడుపులు గురువారం దేవస్థాన ఈవో శ్రీకాంత్ రావు ఆధ్వర్యంలో ముడుపులు విప్పగా రూ.1,65,64,100 ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో శ్రీకాంత్ రావు తెలిపారు. ఈ ముడుపులు విప్పుటకు పర్యవేక్షణ అధికారి ఎం.రాజమౌళి పర్యవేక్షకులు అశోక్ కుమార్, హరిహరనాథ్, సునీల్ కుమార్, చంద్రశేఖర్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్, ఏఎస్ఐ, హోమ్ గార్డ్స్, శ్రీరాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



# అది నాకు ప్రత్యేకం

నేషనల్ క్రష్ రష్మిక 2014 లో మోడలింగ్ ప్రారంభించి.. అదే ఏడాదిలో క్లీన్ అండ్ క్లియర్ ఫ్రెష్ ఫేస్ ఆఫ్ ఇండియా టైటిల్ గెలుచుకున్నది. క్లీన్ అండ్ క్లియర్ బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా చేసింది. తర్వాత నేషనల్ క్రష్ కిరిక్ పార్టీ అనే కన్నడ సినిమాతో సినీ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది. తర్వాత ఈ హీరోయిన్ పునీత్ రాజ్ కుమార్ సరసన అంజని పుత్ర, గణేష్‌కు జోడిగా ఛమక్ అనే మూవీల్లో అవకాశం కొట్టేసింది. నాగశౌర్యతో కలిసి ఛలో సినిమాలో అదర్భుతంగా నటించి.. తన క్యూట్‌నెస్‌తో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో స్థానం సంపాదించుకుంది. తర్వాత ఈ భామ వరుస చిత్రాలతో అలరించింది. దేవదాస్, గోత గోవిందం, యజమన, డియర్ కామ్రేడ్, భీష్మ, పొగరు, సుల్తాన్, పుష్ప, ఆడవాళ్లు మీకు జోహార్లు, సీతారామం, వారసుడు, మిషజ్ మజ్ను, యానిమల్, పుష్ప ది రూల్, ఛావా సికందర్ వంటి చిత్రాల్లో నటించి మెప్పించింది. ఈ ముద్దుగుమ్మ సోషల్ మీడియాలో తన వ్యక్తిగత, వృత్తిపర విషయాలు కూడా అభిమానులతో పంచుకుంటుందన్నది.  తాజాగా రష్మిక తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో ఓ ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టింది. చీరపై పిక్స్ పంచుకుని "ఈ చిత్రాలన్నీ నాకు చాలా ఇష్టమైనవి. ఈ ఫొటోలోని రంగు, వాతావరణం, ప్రదేశం, నాకు చీరను బహుమతిగా ఇచ్చిన అందమైన మహిళ, ఫొటోగ్రాఫర్, ప్రతిదీ నాకు భర్తీ చేయలేనివి' అంటూ రాసుకొచ్చింది. ప్రజెంట్ ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.

